ఈవెంట్స్‌పై ఉన్న శ్రద్ధ

నిర్వహణపై ఏదీ..?

- పీజేఆర్ స్టేడియం.. సమస్యల వలయం
- నాసిరకంగా మరమ్మతులు

చందానగర్: స్టేడియం అనగానే పచ్చదనం పరుచుకున్న గ్రౌండ్. వాకర్స్ ట్రాక్. వివిధ రకాల క్రీడలకు సంబంధించిన కోర్టులు ఉంటాయని అనుకుంటాం. కానీ చందానగర్ పీజేఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నిర్వహణ పూర్తిగా కొరవడింది. స్టేడియం నిర్వహణ చూసే అధికారులు మాత్రం ఈవెంట్స్ పైనే ఎక్కువగా మక్కువ చూపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవెంట్‌ల కోసం ఇష్టానుసారంగా టెంట్‌లు, బారికేడ్లు, వాకింగ్ ట్రాక్‌లో అడ్డుగా వేస్తున్నారని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 మంది సిబ్బంది ఉన్నా, పట్టించుకోవడం లేదని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

ఇదీ.. స్పోర్ట్స్ కాంప్లెక్స్ దుస్థితి



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని వాలీబాల్ కోర్టులో మట్టి కుప్ప



చందానగర్‌లోని పీజేఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

ఇవీ సమస్యలు

- వాలీబాల్ కోర్టులో ఎక్కడపడితే మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి.
- బ్యాడ్మింటన్ కోర్టులో మ్యాట్ పూర్తిగా చిరిగిపోయింది.
- చెట్ల కుండీలు పగిలిపోయాయి.
- బాత్‌రూమ్‌లను స్టోర్ రూమ్‌లుగా వాడుతున్నారు.
- స్టేడియంలో క్రీడలకు సంబంధించిన వస్తువులు ఎక్కడపడితే అక్కడ పడేశారు.
- విద్యుత్ బోర్డు ప్రమాదకరంగా ఉంది.
- పార్కింగ్ లేక ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు.
- స్టేడియంలోకి వచ్చే వారికి కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా కరువయ్యాయి.
- రెయిలింగ్‌కు నాసిరకంగా మరమ్మతు చేయడంతో పైపులు ధ్వంసమయ్యాయి.
- వాకింగ్‌ట్రాక్ లేక ఖాళీ స్థలంలో వాకింగ్ చేస్తున్నారు.

పరిష్కరించాల్సిన సమస్యలు..

- ఈవెంట్స్‌కు ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వకూడదు.
- జిమ్, బ్యాడ్మింటన్ కోర్టులను బాగుచేయాలి.
- స్టేడియంలోని వస్తువులకు ప్రత్యేకంగా స్టోర్ రూమ్ ఏర్పాటు చేసి వాటిని అందులోనే భద్రపర్చాలి
- స్టేడియం చుట్టూ భద్రత పెంచాలి.





స్టేడియంలో మూలన పడేసిన క్రీడా సామగ్రి



స్టేడియంలో మరుగుదొడ్ల దుస్థితి



ధ్వంసమైన రెయిలింగ్



బాత్‌రూమ్‌లను స్టోర్ రూమ్‌లుగా వాడుతున్న దృశ్యం

నిర్వహణ లోపం



పీజేఆర్ స్టేడియంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారు. సిబ్బంది మాత్రం ఎక్కడ కనబడడం లేదు. ఉన్నతాధికారులు పీజేఆర్ స్టేడియం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– రఘునందన్‌రెడ్డి, చందానగర్

ఈవెంట్స్‌కు అనుమతి ఇవ్వొద్దు



పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ అధికారులు ఇష్టానుసారంగా ప్రైవేట్ ఈవెంట్స్‌కు అనుమతులు ఇస్తున్నారు. దీంతో వాకర్స్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈవెంట్‌కు సంబంధించిన సామగ్రి ఎక్కడపడితే అక్కడ పడేసి వెళ్తున్నారు. స్టేడియంలోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారు.

– రమణమూర్తి, చందానగర్

కొత్త ఔషధాలు అభివృద్ధిని నిర్ధారిస్తాయి

ప్రొ. ముఖేష్‌కుమార్‌గుప్తా

రాయదుర్గం: కొత్త ఔషధాలు అభివృద్ధిని నిర్ధారిస్తాయని నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్(ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్)–ఐసీఎంఆర్ ప్రొఫెసర్ డాక్టర్ ముఖేష్‌కుమార్ పేర్కొన్నారు.గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, సైన్స్‌గురు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ మూడవరోజు ఆన్‌లైన్‌లో ఆయన మాట్లాడుతూ బయో ఫార్మాస్యూటికల్ పరిశోధన పరిశ్రమ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఏడీజీ వైఎల్ లైఫ్ సైన్సెస్ ప్రతినిధి డాక్టర్ కెఎస్‌రావు మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధికి ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలన్నారు.గిలియడ్ సైన్సెస్ ప్రతినిధి డాక్టర్ వైష్ణవిగంటి మాట్లాడుతూ ఆంకాలజీ చికిత్సలో ఔషధం భవిష్యత్తును రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రేశం రోడ్డు విస్తరణ చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు



ఇంద్రేశం దర్గా వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం నుండి దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్‌ బీ రోడ్డును ఫోర్‌లైన్‌గా విస్తరణ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంద్రేశం దర్గా వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ రోడ్డులో పెద్ద గుంతలు పడ్డాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంద్రేశం ప్రాంతంలో దాదాపు 40 కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాలతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.పెద్ద ట్రక్కులు, అతి భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు ,ఇతర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. గుంతల రోడ్డుతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రోడ్డును విస్తరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయకుమార్, సురేష్‌కుమార్, రాము, సురేష్, నాగేంద్ర ప్రసాద్ ,వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



కాశీవిశ్వేశ్వరస్వామి



అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: శ్రావణమాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. రాయదుర్గం, నానక్‌రాం గూడ,ఖాజాగూడ, గౌలిదొడ్డిలోని శివాలయం , గోపన్‌పల్లి, ఎన్జీఓఆర్‌నగర్, గచ్చిబౌలి, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, కొండాపూర్, కొత్తగూడ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలోని నల్లపోచమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శివకుమార్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సున్నం చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువుల్లోని గుర్రపు డెక్క, చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈపనులను స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు.

శ్మశానవాటికలో వసతులు కల్పించాలి

ప్రజావాణిలో వినతి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని హిందూ శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జోనల్ కమిషనర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, బి. శ్రీనులు పాల్గొని మాట్లాడుతూ శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ, వీధి లైట్లు, బర్నింగ్ ప్లాట్‌ఫారంలను నిర్మించాలని, అలాగే మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా కోరామన్నారు. బస్తీ నుంచి వాటిక వరకు సిమెంట్ రోడ్డు వేయాలన్నారు. అలీ తలాబ్ చెరువులోని గుర్రపుడెక్కను తొలగించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన జెడ్‌సి అపూర్వ చౌహాన్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

కాలనీల్లో అంతర్గత రోడ్ల మరమ్మతులు



గచ్చిబౌలి డివిజన్ వినాయకనగర్‌లో గుంతలు పడ్డ బీటీ రోడ్డు



గుంతలు పూడుస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు జీహెచ్ఎంసీ అధికారులు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలోని అంతర్గత రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశంపై జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ సూచనల మేరకు సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీశ్వర్, ఏఈ సమంత పర్యవేక్షణలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వినాయకనగర్‌లో రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. దశలవారీగా అన్ని కాలనీలు, బస్తీలలో పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

డీసీపీకి వినతి



మాదాపూర్ డీసీపీ శ్రీకాంత్‌ను కలిసిన సంఘం సభ్యులు

చందానగర్: శేరిలింగంపల్లి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు వచ్చి కొంతమంది వ్యక్తులు యూనియన్ల పేరుతో బెదిరిస్తున్నారంటూ సోమవారం మాదాపూర్ డీసీపీ శ్రీకాంత్‌కు శేరిలింగంపల్లి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం వినతిపత్రం అందించారు. చర్యలు తీసుకోవాలని డీసీపీని కోరారు.వినతిపత్రం అందించిన వారిలో ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భరత్‌గౌడ్, మండల అధ్యక్షులు ఎం.ఆచార్య, కార్యదర్శి శ్రీనివాసు శంకర్, ట్రెజరర్ అబ్దుల్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల సత్తా చాటుతాం

నగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర



మాట్లాడుతున్న ఉప్పరి శేఖర్

రాయదుర్గం: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల చైతన్యాన్ని చూపుతామని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని సగర సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన బలం లేక చట్టసభల్లో అడుగుపెట్టడానికి అవకాశం లేని తమ జాతి భవిష్యత్‌లో రాజకీయాలను శాసించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తామన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో వేలాదిమందితో సగర చైతన్య సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హరికిషన్, నాయకులు సత్యం, వడ్డకొండ కుమారస్వామి, ఆంజనేయులు, ఆస్కాని మారుతి, సురేష్, మహేందర్, సాయిగణేష్, స్రవంతి ,24 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, రాష్ట్ర యువజన సంఘం, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం-పచ్చదనం’ ప్రారంభం



దోయన్స్ కాలనీలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే గాంధీ



పటాన్‌చెరులో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

శేరిలింగంపల్లిజోన్ బృందం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం అంతటా సాగుతుంది. జంట సర్కిళ్లు కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ సర్కిళ్ల లోని కాలనీలు, బస్తీలలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పలు డివిజన్లలో పర్యటించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కార్పొరేటర్లు కొండాపూర్‌లో హమీద్‌పటేల్ ,గచ్చిబౌలిలో గంగాధర్‌రెడ్డి, హఫీజ్‌పేట్‌లో జగదీశ్వర్‌గౌడ్, పూజితాగౌడ్, చందానగర్‌లో మంజులారెడ్డి, మియాపూర్‌లో శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఆరంభమైంది. కాగా పలు కాలనీలు,బస్తీలలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇతర అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా పలు చోట్ల ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు.

కాలనీలు,బస్తీలలో పారిశుద్ధ్య పనులు..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కాగా ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారులు, పార్కులు, బస్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాలలో శుభ్రత, వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు పనులను చేపట్టారు.



గచ్చిబౌలి డివిజన్‌లో మొక్క నాటుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులు



కొండాపూర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, అధికారులు, స్థానికులు



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 35, పచ్చిమిర్చి 70, బెండ 40, కాకర 60, దొండ 45, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 90, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 300.

కాంగ్రెస్‌లో చేరికలు



ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

మియాపూర్: రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జేపీఎన్‌నగర్ కాలనీలో డివిజన్ జనరల్ సెక్రటరీ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జగదీశ్వర్‌గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రసాద్, మనోజ్, వెంకటేష్, సుందర్, వినయ్, నవీన్, జగదీష్, ఆనంద్, గణేష్, మహేష్, హరీష్, శివ, కిరణ్ తదితరులున్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో..

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ, యూత్ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ సోమవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్



ధూమపానంపై అవగాహన కల్పిస్తున్న అధికారి విష్ణువర్ధన్

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేధం అని, అతిక్రమిస్తే రెండేళ్ల జైలు తప్పదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు.సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం తోషిబా పరిశ్రమ వద్ద కార్మికులకు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం గీతం యూనివర్సిటీ పరిధిలోని పలు దుకాణాలు, కాలేజీ పరిసర ప్రాంతాల్లో ధూమపానం చేస్తున్న వారికి అవగాహన కల్పించారు.అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, 18 ఏళ్లలోపు వారికి పొగాకు వస్తువులను అమ్మరాదని సూచించారు. విద్యాసంస్థల వద్ద వంద మీటర్ల వరకు ధూమపానం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్యామ్ సుందర్, విద్యార్థులు, యువత, షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యం

ఫిలింనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, బాలింతలు, గర్భిణులకు సోమవారం బాలామృతం పంపిణీ చేశారు. అలాగే 0–24 నెలల వయస్సు ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లులు శిశువులకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని అవగాహన కల్పించారు. కంగారు పద్ధతిలో పిల్లలకు పాలిచ్చే విధానాన్ని తెలియజేశారు. అలాగే పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీ బిడ్డ ఎలా క్షేమంగా ఉంటారో.. ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానం గురించి వివరించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు రామరావు దేశ్‌పాండే అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ భెల్ టౌన్‌షిప్ జిల్లా బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. బ్రాహ్మణుల హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

20 మందికి జరిమానా

ఒకరికి జరిమానా, రెండు రోజులు జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన,అదేవిధంగా మరో వ్యకి కి జరిమానతో పాటు జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... శని,ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 20 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన,అదే విధంగా మరొకరికి రూ. 2 వేల జరిమానతో పాటు 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ,సీవరేజ్ బోర్డు అధికారులు, జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం బకెట్ క్లీనింగ్ ద్వారా మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తీసివేయించారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, కాలనీవాసులు బాలు, వాసు, రామకోటేశ్వరరావు, శ్రీనివాస్, నాయకులు నిరంజన్‌గౌడ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్, అధికారులు